క్లుప్తంగా

సభ్యత్వ నమోదు

హన్వాడ: మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. బుధవారం పూజారితండా, దొర్రితండా, పెద్దర్పల్లి, సల్లోనిపల్లి, నాగినోనిపల్లి తదితర గ్రామాల్లో కార్యక్రమం చేపట్టారు. జిల్లా నాయకులు రాంబాబు, రమాకాంత్, శ్రీనివాస్, విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కృష్ణయ్య, సింగిల్‌విండో డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో 75వ ఇంటింటా భజన మన ఇంట్లో భజన కార్యక్రమాన్ని స్థానిక అశోక్‌టాకీస్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన అమవాస్య అన్నదాన మండపంలో నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పడిపూజ చేపట్టారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే, సతీష్‌గుప్త, జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, రామేశ్వర్, సతీష్, శ్రీను, భానుప్రకాశ్, శంకర్ పాల్గొన్నారు.

అందరికీ రుణమాఫీ

దేవరకద్ర: రైతులు అపోహ పడ వద్దని అర్హులందరికీ రుణమాఫీ జరుగుతుందని మదనాపురం మార్కెట్ చైర్మన్ పల్లెపోగు ప్రశాంత్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్రలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికీ రుణమాఫీ కాని వారు హెల్ప్‌డెస్క్‌లలో వివరాలు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం క్రాఫ్ ఇన్సూరెన్స్ చేస్తుందని దీనికి డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. పంట నష్ట పోతే నష్ట పరిహారం పొందవచ్చని సూచించారు. మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, కౌకుంట్ల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, చిన్నచింతకుంట నరేందర్‌రెడ్డి, మూసాపేట శెట్టి శేఖర్ పాల్గొన్నారు.

నవాబుపేటలో మంత్రి, ఎమ్మెల్యేల సందడి

నవాబుపేట: గురుకుంటలో మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు సత్యనారాయణరెడ్డి కుమారుడి రిసెప్షన్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. అనంతరం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్త శివకుమార్ సోదరి వివాహానికి వెళ్లి దంపతులను ఆశీర్వదించారు. ఓ సామాన్య కార్యకర్త ఇంటికి మంత్రి, ఎమ్మెల్యేలు రావటంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని నిమ్మబావిగడ్డ ఎర్రసత్యం కాలనీకి చెందిన చంద్రకళ తన కుమార్తె వద్దకు మక్తల్ వెళ్లాలనుకుంది. ఈ క్రమంలో హనుమాన్‌టెంపుల్ వద్ద ఆటో ఎక్కి బస్టాండ్‌లో దిగింది. అయితే ఆమె దుస్తులతో ఉన్న బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయింది. విషయం గుర్తించిన ఆటో డ్రైవర్ జుబేర్ యూనియన్ నాయకుడు షేక్‌హాజీకి సమాచారం ఇచ్చారు. బ్యాగ్ తీసుకుని మహిళను వెతికి అందజేశారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది.

వీఏటీఎస్ పద్ధతితో సర్జరీ

పాలమూరు: మహబూబ్‌నగర్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఆధునాతన వీఏటీఎస్ పద్ధతి ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ సర్జరీ చేశారు. ఇటీవల 68 ఏళ్ల వ్యక్తి దగ్గు, ఛాతీ నొప్పితో బాధపడుతూ ఆస్పత్రి వచ్చాడు. దీంతో డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ప్రదీప్ కే రెడ్డిలు అతడిని పరిశీలించి అతనికి ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్నట్లుగా నిర్ధారించారు. వీఏటీఎస్ ప్రకారం సర్జరీ చేశారు. ఈ పద్ధతిలో సర్జరీ చేయడం పాలమూరులో ఇదే మొదటిసారి అని వారు పేర్కొన్నారు.

ప్రోత్సాహకాల అందజేత



భూత్పూర్: గ్రామీణ విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా పెట్టుకుని వారి ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ రిజినల్ మేనేజర్ రంజిత్‌కుమార్ తెలిపారు. బుధవారం పాత మొల్గర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు ఐదు మందికి రూ. 2500 చొప్పున నగదు అందజేశారు. ఏటా ఆర్థిక పరిస్థితులను గుర్తించి విద్యార్థులను ఎంపిక చేసి నగదును అందిస్తున్నట్లు వివరించారు. వందమంది రైతులను సత్కరించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ప్రోత్సాహకాలు ఇవ్వడంపై కంపెనీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. హెచ్‌ఎం విద్యావతమ్మ, కంపెనీ టీం శశిధర్ గౌడ్, చిల్లా రఘురెడ్డి పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



గండేడ్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి మోటారు

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: 'తాగునీటికి తప్పని పాట్లు' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వివరాల్లోకి వెళ్తే.. రెడ్డిపల్లికి నీటిని సరఫరా చేసే పైపులైను రోడ్డు పనుల విస్తరణలో భాగంగా దెబ్బతింది. దీంతో మూడు నెలలుగా నీటి సరఫరా లేకుండా పోయింది. అదేవిధంగా ఇతర గ్రామాల్లోనూ పలు సమస్యల వల్ల తాగునీటికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే సాక్షిలో కథనం ప్రచురించగా.. మిషన్ భగీరథ డీఈఈ రంజిత్‌రెడ్డి, ఎంపీడీఓ దేవన్న, మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ తదితరులు పైపులైన్ డ్యామేజీ అయిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పైపులైన్ వేయించారు. బుధవారం నుంచి గ్రామంలో నీటి సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోనూ నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. బుధవారం కొత్తగా రెండు సింగిల్ ఫేజ్ మోటార్లు తెచ్చి బోర్ల వద్ద ఏర్పాటు చేయించారు. పంచాయతీ కార్యదర్శి బాసిత్ అలీ, మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచ్ చంద్రకళ తదితరులు దగ్గరుండి పనిచేయించారు. ప్రస్తుతం సమస్య తీరినట్టైంది. దీనికి తోడు మిషన్ భగీరథ నీరు కూడా ప్రారంభం అయినట్లు అధికారులు తెలిపారు. గ్రిడ్ సమస్యను పరిష్కరించారని దీంతో పాటు ఉమ్మడి మండలాల్లో ఒక్క ధర్మాపూర్ మినహా మిగతా గ్రామాల్లో కూడా మిషన్ భగీరథ నీటి సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. గురువారం నాటికి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందుతుందని వివరించారు. ఎంపీడీఓ దేవన్న అన్ని గ్రామాల కార్యదర్శులక, స్పెషల్ ఆఫీసర్లకు నీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచనలు చేశారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ..

- తహసీల్దార్ ఎదుట శరీరంపై పెట్రోల్ పోసుకున్న వ్యక్తి



నర్సింహారెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు

మహమ్మదాబాద్: భూమి రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ ఓ వ్యక్తి తహసీల్దార్ ఎదుట పెట్రోల్‌ను శరీరంపై పోసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన నర్సింహారెడ్డికి, వెంకట్‌రెడ్డిపల్లికి చెందిన అంజిలమ్మ, నాగిరెడ్డిల కుమార్తె రాఘవేంద్రమ్మతో 23ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. కాగా నర్సింహారెడ్డి ఇల్లరికం వచ్చారు. కొన్నేళ్ల వరకు వారికి సంతానం కాలేదు. ఈ క్రమంలో గొడవలు జరగడంతో దూరంగా ఉంటున్నారు. రాఘవేంద్రమ్మ అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతిచెందారు. అంజిలమ్మ భర్త కూడా మరణించారు. దీంతో అంజిలమ్మ మహమ్మదాబాద్‌లోని ఇంట్లో ఒక్కరే ఉంటున్నారు. కాగా తనకున్న ఎకరం, 30 గుంటల పొలాన్ని ఇతరులకు అమ్మడానికి సిద్ధమై బుధవారం రిజిస్ట్రేషన్ పెట్టుకున్నారు. విషయం తెలిసిన నర్సింహారెడ్డి అక్కడికి వచ్చారు. రిజిస్ట్రేషన్ ఆపాలని అధికారులకు చెప్పినా ఫలితం లేకపోతుందని భావించాడు. నేరుగా తహసీల్దార్ ఎదుటకు వెళ్లి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి అతడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా అతడికి, తన కుమార్తెకు విడాకులు అయ్యాయని అంజిలమ్మ నకిలీ విడాకుల పత్రాలు చూయించినట్లు పలువురు గ్రామస్తులు తెలిపారు. నర్సింహారెడ్డి ఇల్లరికం వచ్చినందున కొంత భూమయినా, ఇళ్లయినా ఇవ్వాలని అన్నారు. అత్తా, అల్లుడు ఇద్దరూ ఒంటరి వారేనని వారికెవ్వరు దిక్కులేరంటూ పలువురు పెద్దలు పేర్కొన్నారు. కాగా ఇరువురు మాట్లాడుకుని రావాలని రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. భారత్ బంద్‌లో భాగంగా బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. నర్సింహయ్య, కానుగడ్డ యాదయ్య, బాలరాజు, కంచిమి లక్ష్మణ్, మూలే కేశవులు, బ్యాగరి వెంకటస్వామి, చెన్నకేశవులు, రాములు, చెన్నయ్య, రఘునాథ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలో బుధవారం మాలమహానాడు నాయకులు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ తీర్పును నిరసిస్తూ ఆందోళన చేశారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను, దుకాణ సముదాయాలను బంద్ చేయించారు. అంజయ్య, వేముల కృష్ణయ్య, నాగన్న, యాదయ్య, మూర్తి, మాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండలంలో మాలల ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు పత్తి గోపాల్, దస్తయ్య, తలారి రంగయ్య, దాసు, వెంకటయ్య, మల్లేష్, శశికుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో త్వరగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ కోరారు. బుధవారం పట్టణంలోని ఏనుగొండలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. కోర్టు తీర్పును గౌరవించి మాలలు ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని కోరారు. వెంకటయ్య, సాయిలు, బచ్చన్న, జయమ్మ, మాధవ్, చెన్నయ్య, బాలమాసయ్య, కాలె గోపాల్, లక్ష్మయ్య, రాజు, చెన్నయ్య, మన్యం, జయన్న, ఎల్లప్ప పాల్గొన్నారు.

సుప్రీం తీర్పునకు విరుద్ధంగా మాల మహానాడు, అనుబంధ సంఘాల నాయకులు భారత్ బంద్‌కు పిలుపునివ్వడం వారి అవివేకానికి నిదర్శనమని ఎంఈఎఫ్ జాతీయ నాయకులు పోలే బాలయ్య, జె.బాలరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరాములు అన్నారు. బుధవారం సమావేశంలో మాట్లాడారు. కొండయ్య, రామచందర్, శ్రీను, బాలరాజు, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీలో గుండె సంబంధ వైద్యసేవలు'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

పాలమూరు: జిల్లా కేంద్రంలోనూ గుండె సంబంధిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని.. బాధితులు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. సుశ్రుత ప్రజావైద్యశాలలో నూతనంగా వచ్చిన గుండె సంబంధిత ఆరోగ్య శ్రీ ఉచిత సేవలను బుధవారం ప్రారంభించారు. గుండె వైద్య సేవలు ఆరోగ్య శ్రీ ద్వారా చేయడం వల్ల పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, నిమ్స్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అమరేష్‌రావు, ఐఎంఏ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, డాక్టర్ ప్రతిభ, వైద్యులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీకి ప్రత్యేక బృందాలు

గండేడ్: ఉమ్మడి మండల పరిధిలోని హాస్టళ్ల తనిఖీకి ప్రత్యేక టీంలను నియమించారు. ఈమేరకు కలెక్టర్ విజయేందిర ఉత్తర్వులు జారీ చేశారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు ఛత్రునాయక్ నియమితులయ్యారు. ఈయన ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ తదితరాలను తనిఖీ చేసేందుకు మూడు టీంలను ఏర్పాటు చేశారు. గండేడ్ తహసీల్దార్ నాగలక్ష్మీ టీం లీడర్‌గా.. సభ్యులుగా ఇంట్రా ఏఈ రామకృష్ణ, ఐసీడీసూపర్‌వైజర్ రాధికలు ఉన్నారు. ఎంపీడీఓ దేవన్న టీం లీడర్‌గా.. గండేడ్ పీఆర్ ఏఈ హలీం, ఏపీఓ హరిశ్చంద్రుడు టీం సభ్యులుగా మరో టీం ఏర్పాటు చేశారు. ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి టీం లీడర్‌గా.. మహమ్మదాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో సల్కర్‌పేట్ మినీగురుకులం తదితరాలను తనిఖీ చేయనున్నారు. వీరంతా వివిధ సమస్యలపై తనిఖీ చేసి ఈ నెల 31లోపు రిపోర్టులు ఇవ్వాల్సిందిగా కలెక్టర్ సూచించారు. కాగా నేటి నుంచి తనిఖీ జరగనున్నాయి.

పనులు ప్రారంభం



రాజాపూర్: దోండ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బోడగుట్టతండాలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యురెడ్డి తన సొంత ఖర్చులతో 120 మీటర్ల సీసీరోడ్డు వేయించేందుకు బుధవారం పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా తండావాసులు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సేవ్యానాయక్, శ్రీనివాస్, అభిమన్యు యువసేన అధ్యక్షుడు రామకృష్ణగౌడ్, సురేష్ , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల తరలింపులో ఉద్రిక్తత

మహబూబ్‌నగర్ క్రైం: ఆవుల తరలింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం మధ్యాహ్నం దేవరకద్ర సంత నుంచి మూడు వాహనాల్లో ఆవులను మహబూబ్‌నగర్‌కు తరలిస్తుంటే కోడూర్ వద్ద భజరంగదళ్ నాయకులు అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆవులు ఉన్న వాహనాలను గోశాలకు తరలిస్తుంటే టీడీగుట్ట వద్ద మైనార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో వాహనాలు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా అక్కడికి రెండు వర్గాలు చేరుకున్నాయి. పరిస్థితి కొంత ఉద్రిక్తతకు దారితీస్తున్న క్రమంలో పోలీసులు అప్రమత్తమై అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, ఈ కుబేర్‌లో రెండేళ్లుగా నిలిచిపోయిన బిల్లులు, పీఆర్‌సీ చెల్లిస్తా మని చెప్పి వాటి ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



స్టేషన్ మహబూబ్‌నగర్: మిల్లీమహాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో డాక్టర్ మోమిత, తస్లీం జహాన్‌లకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక క్లాక్‌టవర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నిందితులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చీఫ్ ప్యాట్రన్ ఖాజాఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర తఖీ హుస్సేన్, ఖుద్దూస్‌బేగ్, హాఫీజ్ ఇద్రీస్, అబ్దుల్లా సున్నీ, నూరుల్లా, జాకీర్ అడ్వకేట్, సాదతుల్లా హుస్సేని, ఫారుఖ్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: వైద్యుల నిర్లక్ష్యంతో చికిత్స కోసం వచ్చిన మహిళ మృతి చెందిందని ఆందోళన చేపట్టిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహిళకు చికిత్స అందించే విషయంలో వైద్యులు నిర్లక్ష్యం చేశారన్నారు. అందువల్లే ఆమె మృతి చెందిందని పేర్కొన్నారు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో పాటు సంఘాల నాయకులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.

కేసు నమోదు

మహమ్మదాబాద్: పంటను నాశనం చేసిన ఘటనలో పోలీసులు కేసునమోదు చేశారు. వివరాలు ఇలా.. గాధిర్యాల్‌కి చెందిన జమాల్‌పూర్ నాగరాజు, రాంచెందర్‌జీల మధ్య కొంత కాలంగా భూతగాదాలు కొనసాగుతున్నాయి. ఇదే తరుణంలో గ్రామస్తులు వెళ్లి ఇద్దరికి భూమి పంచి ఇరువురి మధ్య ఒప్పందం కుదుర్చి పేపర్లు కూడా రాయించారు. కాగా ఒప్పందాన్ని వ్యతిరేకించి మూడురోజుల తరువాత నాగరాజు వేసిన వరిపంటను రాంచందర్‌జీ నాశనం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

జడ్చర్ల: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ విష్ణు కథనం ప్రకారం.. స్థానికంగా వేంకటేశ్వర కాలనీలో మధులత(19), భర్త సబావత్ బీంజీ కలిసి కొంతకాలం నుంచి నివాసం ఉంటున్నారు. బీంజీ పోలేపల్లి సెజ్‌లోని ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తుండగా మధులత ఇంటి వద్దనే ఉండేది. ఈక్రమంలో భర్త ఉద్యోగానికి వెళ్లిన సమయంలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టు పక్కలా, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో మధులత తల్లి దేవీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: కాటవరం శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా బేతంచర్లకు చెందిన సుధాకర్ లారీలో రాక్ శాండ్‌ను హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున లారీ టైర్ పగిలిపోవడంతో కాటవరం శివారులో లారీని రోడ్డు పక్కకు నిలిపాడు. కొంతసేపటి తర్వాత సిమెంట్ లోడుతో వెళ్తున్న ఓ లారీ ఆగిన లారీని వెనుక ఢీకొట్టింది. ఘటనలో సిమెంట్ లారీలో ఉన్న గిరికి గాయాలయ్యాయి. ముందు లారీలో ఉన్న సుధాకర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. సిమెంట్ లారీ క్యాబిన్ బాగా దెబ్బతిన్నది. రహదారి నిర్వాహకులు ఘటనా స్థలానికి చేరుకుని వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. రాక్ శాండ్ లారీ వెనుక భాగం దెబ్బతినడంతో అందులో ఉన్న శాండ్ కొంత రోడ్డుపై పడిపోయింది.

పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం



కారుకొండలో విద్యార్థులకు షూ అందిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: 'ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల సమస్యలు తీర్చే అవకాశం ఇవ్వాలని వేడుకొంటూ నాడు పర్వతాపూర్ మైసమ్మ చెంత నుంచి పాదయాత్ర చేపట్టాను. అప్పట్లో పాదయాత్రలో నన్ను కలిసేందుకు వచ్చిన చిన్నారుల కాళ్లకు కనీసం చెప్పులు కూడా లేకపోవటం కలిచివేసింది. దీంతో బడి పిల్లలందరికీ షూ ఇవ్వాలని నిర్ణయించుకున్నా. తాజాగా పంపిణీ చేస్తున్న. ఇలా నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే భాగ్యం నాకు దక్కింది. ఇదంతా అమ్మవారి దయతోనే' అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం కారుకొండ, యన్మన్‌గండ్ల పాఠశాలల్లో విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో వసతుల ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. కారుకొండ పాఠశాలకు నిధులు సమకూరుస్తానని.. మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. శివకుమార్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహచారి, భూపాల్‌రెడ్డి, జహీర్, వెంకటేష్‌గౌడ్, ఆంజనేయులు, రాజేష్, లింగం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి

దేవరకద్ర: కొత్త ఓటర్ల నమోదును చేపట్టాలని దేవరకద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాలలో బీఎల్‌ఓలు పోలింగ్ స్టేషన్‌లలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఓటర్ల పేర్లలో తప్పులు, పుట్టిన తేది సవరణలు ఉన్నా, అడ్రస్ మార్పు, ఇంకా ఏ సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించాలని సూచించారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీలు దీపిక, శోభా, ఆర్‌ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పరిమళగిరిపై వెలసిన రాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం మధ్యారాధన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ప్రహ్లాదరాయుల ఉత్సవ మూర్తికి కనకాభిషేకం చేశారు. రాఘవేంద్రస్వామి బృందావనానికి విశేష పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో చివరి రోజైన గురువారం ఉత్తరారాధన, మహా రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దివాన్‌జీ గురురాజాచార్యులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు నిర్మాల్య విసర్జనము, 7.30గంటలకు అష్టోత్తర పారాయణం, పాదపూజ, కనకాభిషేకం, పంచామృతాభిషేకం చేసి వస్త్ర సహిత పుష్ప అలంకరణ గావించారు. 11.30గంటలకు తులసి అర్చన, 12గంటలకు నైవేద్యం, మహామంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మఠం సిబ్బంది బాలకృష్ణాచార్యులు, సుదర్శనాచార్యులు, రాఘవేంద్రాచార్యులు, భక్తులు అయ్యన్న, శ్రీనివాసులు, గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, తాగునీటిపై దృష్టి పెట్టండి

గండేడ్: గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య చర్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. బుధవారం గండేడ్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయని వాటి నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: మున్సిపల్ పరిధిలో శానిటేషన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. విధులు నిర్వహించిన అనంతరం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిరసన చేపట్టారు. 8గంటల పని అమలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తొలగింపు, ప్రత్యక్ష హాజరు విధానం అమలు వంటివి వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు మహేష్, కోశాధికారి విజయ్‌కుమార్, కేశవులు, కృష్ణ, విద్యాసాగర్, యాదయ్య, వినోద్, ఆంజనేయులు, చెన్నకేశవులు, శ్రీకాంత్, యాదమ్మ, లక్ష్మమ్మ, చంద్రకళ, అనూష, శివలీల, స్వరూప పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్ కోసం పాట్లు



తహసీల్దార్ కార్యాలయంలో చంటి పిల్లలతో మహిళల ఎదురుచూపులు

మహబూబ్‌నగర్ రూరల్: భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న క్రయవిక్రయదారులు బుధవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద అవస్థలు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. స్లాట్ బుకింగ్‌లో సమయం ఇవ్వడంతో భూములు అమ్మిన, కొనుగోలు చేసిన సుమారు 15 మంది తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో తహసీల్దార్ ఘన్సీరామ్ లేకపోవడంతో చాలా సేపు వేచి చూశారు. ఎంతకూ ఆయన రాకపోవడంతో సిబ్బందిని వాకబు చేశారు. కాగా మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటనకు సంబంధించిన ప్రొటోకాల్ డ్యూటీలో తహసీల్దార్ ఉన్నారని వారు సమాధానం ఇచ్చారు. కార్యక్రమం తర్వాతే వస్తారని చెప్పడంతో రాత్రి వరకు అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో స్లాట్ బుక్ చేసుకుని చంటి పిల్లలతో వచ్చిన మహిళలు నానా అగచాట్లు పడ్డారు. చివరకు తహసీల్దార్ రావడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. పరిస్థితి, ప్రొటోకాల్ ఇట్లే ఉంటే భవిష్యత్తులో స్లాట్ బుక్ చేసుకున్న వారికి మరిన్ని ఇబ్బందులు తప్పవని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ప్రొటోకాల్ డ్యూటీ ఉండడం వల్లే తాను తప్పనిసరిగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. భూముల రిజిస్ట్రేషన్ బాధ్యత వేరొకరి అప్పగించే అధికారం తనకు లేదన్నారు. ఒకవేళ తాను సెలవులో ఉంటే జిల్లా కలెక్టర్ ఆ బాధ్యతను డీటీ అప్పగించే అవకాశం ఉంటుందన్నారు.

యోగాతో ఆరోగ్యం



జడ్చర్ల టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చిన ప్రముఖ యోగా నిపుణులు శివానంద ఆచార్య అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ సమావేశ మందిరంలో ఆర్యవైశ్యసంఘం మండల శాఖ ఆధ్వర్యంలో యోగా తరగలులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక బాటలో పయనించాలని అన్నారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మేడిశెట్టి రామకృష్ణ, కొత్త మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: కందూర్‌కి చెందిన మణెమ్మను బుధవారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. కొన్నాళ్ల కిందట జరిగిన ప్రమాదంలో కాలును కోల్పోయిన బాధితురాలికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. హరిజన్ మన్నెం, రంగం గణేష్, జంగం సతీష్, చంద్రమౌళి యాదవ్ ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ధర్నా

జడ్చర్ల టౌన్/దేవరకద్ర: ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బద్నాం చేసేందుకే ధర్నాలు

మిడ్జిల్: ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రజలకు చాలా మేలు చేస్తున్నాయని నాయకులు అన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ధర్నాలకు దిగుతున్నారని ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గౌస్, బాలయ్య, ఉస్మాన్, పర్వతాలు ఉన్నారు.